www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

మంగళవారం, మే 19, 2026



# కల్తీ కల్లుతో ప్రాణ సంకటం

- కోట్ల దందాపై ఎవరి కన్ను
- లక్షల విలువైన మత్తు పదార్థాలు పట్టుబడుతున్నా సూత్రధారులు మాత్రం అందనంత దూరంలో
- లైసెన్సులు తక్కువ...దుకాణాలు ఎక్కువ
- ఒకరి పేరుతో పర్మిట్, మరొకరి పేరుతో వ్యాపారం
- జిల్లా వ్యాప్తంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం?



**నిర్మల్, అక్షిత బ్యూరో:** ఒకప్పుడు ఈత, తాటి చెట్ల నుంచి సహజసిద్ధంగా లభించే కల్లు గ్రామీణ జీవనంలో భాగమైతే ఇప్పుడు అదే కల్లు పేరుతో రసాయనాల మిశ్రమం ప్రజల ప్రాణాలను బలితీసుకుంటోందనే ఆరోపణలు మిగతా.. 2లో





# రైతుల ఖాతాల్లో రూ.237 కోట్ల జమ


- 50 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్, అక్షిత బ్యూరో:**

జిల్లాలో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యంలో 50 శాతం కొనుగోళ్లు పూర్తయ్యాయని, వచ్చేవారం లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు లక్ష్యంగా నిర్దేశించామని, రైతులకు 237 కోట్ల రూపాయల చెల్లింపులు జరిగాయని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. వరి ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లపై కరీంనగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తో కలిసి అధికారులు, రైస్ మిల్లర్లు ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 319 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సీజన్లో 3.61 మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామని అన్నారు. ఇప్పటికీ 3 లక్షల ఒక వెయ్యి మెట్రిక్ టన్నులు కొనుగోళ్ల కోసం వచ్చిందని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి మిగతా.. 2లో





# బెల్ట్‌ల్లోనే కిక్కు?

- బెల్ట్ షాపుల బీభత్సం
- ఎక్సైజ్ శాఖ ఎక్కడ?
- "సిండికేట్".. అక్రమాలకు అడ్డూ అదుపూ లేదు!
- నెలవారీ మామూళ్లతో కళ్లు మూసుకున్న అబ్కారీ శాఖ!
- బెల్ట్ షాపులకి " అబ్కారి శాఖ" ఆశీర్వాదమా?
- ఫోన్లో దొరకరు స్టేషన్లో ఉండరు
- వార్తలు రాస్తే ఏమవుతుంది?
- సిఐ ధీమా!

**భద్రాద్రి కొత్తగూడెం / అక్షిత బ్యూరో:**

భద్రాద్రి కొత్తగూడెంలో బెల్ట్ షాపుల దందా, సిండికేట్ వ్యవహారంలో స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారుల పాత్రపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెలవారీగా అందుతున్న లక్షలాది రూపాయల మామూళ్లతో అబ్కారీ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సిఐ) పూర్తిగా కళ్లు మూసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిండికేట్ వ్యాపారుల నుండి వస్తున్న నల్లధనం మామూళ్లలో సింహభాగం ఈ ఎక్సైజ్ అధికారిదేనని నమ్మదగిన సమాచారం. ప్రభుత్వం ఇచ్చే జీతాల కంటే దాదాపు పది రెట్లకు పైగా ఈ సిండికేట్ ద్వారానే అక్రమ ఆదాయాన్ని సంపాదిస్తూ, మిగతా.. 2లో

# విపత్తుల్లో తక్షణమే స్పందించాలి

- వియాస్‌లో మాక్ డ్రిల్
- కలెక్టర్ చంద్ర శేఖర్



**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్:** ప్రమాదాలు సంభవించి నప్పుడు మనల్ని మనం రక్షించుకుంటూనే ఎదుటి వారిని కాపాడాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించి నప్పుడు అత్యవసర ప్రతిస్పందన, సంసిద్ధత, వ్యవస్థలను బలోపేతం చేసే మిగతా.. 2లో

# కల్తీ కల్లుతో ప్రాణ సంకటం

మొదటి పేజీ తరువాయి..

జిల్లావ్యాప్తంగా వినిపిస్తున్నాయి. కష్టపడి పనిచేసిన తర్వాత కాసింత విశ్రాంతి కోసం కల్లు సేవించే సాధారణ ప్రజలు... కల్తీ మత్తు పదార్థాల బారిన పడి అనారోగ్యానికి గురవుతుండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో గత కొన్నేళ్లుగా లక్షల రూపాయల విలువైన మత్తు పదార్థాలు పట్టుబడుతున్న ఘటనలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి. ఒకసారి రూ.28 లక్షలు, మరోసారి రూ.48 లక్షల విలువైన మత్తు పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నప్పటికీ... ఈ అక్రమ దందా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు? వారిపై చర్యలు ఎందుకు కనిపించడం లేదన్న ప్రశ్నలు జిల్లా ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి.

క్వింటాళ్ల కొద్దీ మత్తు పదార్థాలు జిల్లాకు చేరి ఉంటే... సంబంధిత శాఖల తనిఖీలు ఎక్కడ జరిగాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పట్టుబడుతున్నవారు కేవలం పాత్రధారులే కానీ, అసలు సూత్రధారులపై చర్యలు ఎందుకు కనిపించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిర్మల్, దిలావర్‌పూర్, సోన్, మామడ, సారంగాపూర్, లోకేశ్వరం, కుంటాల మండలాలతో పాటు పలు గ్రామాల్లో కల్లు దుకాణాలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గీత గీయడానికి చెట్లు లేకపోయినా కల్లు దుకాణాలు కొనసాగుతుండటం అనుమానాలకు తావిస్తోంది.

### లైసెన్సులు తక్కువ.. దుకాణాలు ఎక్కువ!

జిల్లాలో అధికారికంగా మంజూరైన కల్లు బట్టీల లైసెన్సులు పరిమితంగానే ఉన్నప్పటికీ... వాస్తవానికి దుకాణాల సంఖ్య మాత్రం అంతకుమించి ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకరి పేరుతో లైసెన్స్ తీసుకుని... మరొకరి పేరుతో దుకాణాలు నడుస్తున్నాయనే ప్రచారం జోరుగా సాగుతోంది.

గ్రామీణ ప్రాంతాల్లో కల్లు దుకాణాల ఏర్పాటుకు వీడీసీ ఆధ్వర్యంలో లక్షల రూపాయల టెండర్లు జరుగుతుండగా... పక్క జిల్లాలకు చెందిన వ్యాపారులు నిర్మల్ జిల్లాలోకి ప్రవేశించి ఈ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారనే సమాచారం వెలుగులోకి వస్తోంది.

### రాజకీయ అండతో దందా?

కొంతమంది అధికార పార్టీలో ఉన్న రాష్ట్రస్థాయి నాయకుల పేర్లు చెప్పుకుంటూ... సంబంధిత అధికారులపై ఒత్తిళ్లు, బెదిరింపులు తెస్తూ ఈ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెలవారీ మామూళ్ల వ్యవస్థ కారణంగానే ఈ దందా నిరాటంకంగా సాగుతోందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

### మత్తు కోసం నిషేధిత రసాయనాల వినియోగం?

కల్తీ కల్లు తయారీలో ఆల్ప్రాజోలామ్, డైజెపామ్, క్లోరల్ మిశ్రమాలు, యూరియా, అమ్మోనియం పదార్థాలు, సోడా యాష్, పురుగుమందులు వంటి ప్రమాదకర రసాయనాలు ఉపయోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 10 లీటర్ల స్వచ్ఛమైన కల్లుకు భారీగా నీరు కలిపి... మత్తు కోసం రసాయనాలు జోడించి విక్రయిస్తున్నట్లు సమాచారం.

### దెబ్బతింటున్న ప్రజల ఆరోగ్యం

ఈ కల్తీ కల్లు కారణంగా నాడీ వ్యవస్థ దెబ్బతినడం, కంటి చూపు కోల్పోవడం, జ్ఞాపకశక్తి మందగించడం, మూత్రపిండాల సమస్యలు, జీర్ణకోశ వ్యాధులు వంటి తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గతంలో పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరిగినప్పటికీ... ఈ దందా మాత్రం ఆగడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది.

### తనిఖీలు పేరుకేనా?

ఎక్సైజ్ శాఖ తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని, శాంపిళ్లను ల్యాబ్‌కు పంపిస్తున్నామని చెబుతున్నా... ల్యాబ్ నివేదికల ఆధారంగా తీసుకున్న కఠిన చర్యలు మాత్రం ప్రజలకు కనిపించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖలు చొరవ చూపి... కల్తీ కల్లు స్థావరాలపై సమగ్ర దాడులు నిర్వహించి, ఈ ప్రమాదకర దందాకు శాశ్వతంగా చెక్ పెట్టాలని బాధిత కుటుంబాలు, జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# రైతుల ఖాతాల్లో రూ.237 కోట్ల జమ

మొదటి పేజీ తరువాయి..

హమాలీల సమస్య ప్రధానంగా కనిపిస్తోందని, లోకల్ హమాలీలను ప్రోత్సహిస్తూ ఈ సమస్యను అధిగమించాలని మంత్రి సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 50 శాతం కొనుగోళ్ల లక్ష్యాన్ని పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో ముందున్నామని తెలిపారు. వారం రోజుల్లోనే 80 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి మరో వారంలో లక్ష మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి చెల్లింపుల విషయంలోనూ జిల్లా ముందు వరుసలో ఉందని తెలిపారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం విక్రయానికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఒక లక్ష 58 వేల 382 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు 78 శాతం ఆన్లైన్లో నమోదు పూర్తయిందని తెలిపారు. 88% ధాన్యం మిల్లర్లు స్వీకరించారన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, రైస్ మిల్లులు, ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# విపత్తుల్లో తక్షణమే స్పందించాలి

మొదటి పేజీ తరువాయి..

విషయమై జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ, రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థల ఆదేశాల మేరకు సోమవారం నల్గొండ జిల్లా, చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వియాస్ సైంటిఫిక్ లిమిటెడ్ కంపెనీ (సైమ్ ల్యాబ్స్) లో నిర్వహించిన "మాక్ డ్రిల్" నమూనా విన్యాసానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆదేశాల మేరకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో వరదలు, అటవీ అగ్ని ప్రమాదాలు, పారిశ్రామిక ప్రమాదాలు సంభవించినప్పుడు జిల్లా యంత్రాంగాల ప్రతిస్పందన, సంసిద్ధతపై వివిధ జిల్లాలలో సంసిద్ధత కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా నల్గొండ జిల్లా పారిశ్రామిక ప్రమాదాల ప్రతిస్పందన, సంసిద్ధతకు ఎంపిక కాగా, ఈ నమూనా కార్యక్రమాన్ని పిట్టంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వియాస్ సైంటిఫిక్ లిమిటెడ్ కంపెనీలో నిర్వహించడం జరిగింది. నమూనా విన్యాసాన్ని పరిశీలించిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు సంబంధిత కంపెనీ తక్షణమే స్పందించాలని, ఫైర్, వాటర్, వైద్య ఆరోగ్య శాఖల బృందాలు నిర్దేశించిన సమయంలో అప్రమత్తం కావాలన్నారు. ఒకరికొకరు





సహకరించుకుంటూ వారిని వారుకాపాడుకుంటూనే ,తోటి వారిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రమాదాల సమయంలో అత్యవసర ప్రతిస్పందనతో పాటు, పరిస్థితులను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండడం, తద్వారా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు నమూనా విన్యాసాలు ఉపయోగపడతాయన్నారు. దీని ద్వారా పరిశ్రమలలో ప్రమాదాలు సంభవించినప్పుడు ఉద్యోగులను ఏ విధంగా సంరక్షించుకోవాలో తెలుస్తుందని చెప్పారు. ఇలాంటి విన్యాసాల వల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు చనిపోయేవారి సంఖ్యను పూర్తిగా తగ్గించడంతో పాటు, ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణ వైద్య చికిత్సలను అందించవచ్చని, తద్వారా సంఘటన సంభవించినప్పుడు ఎంతవరకు సిద్ధంగా ఉన్నామనే విషయం అర్థం అవుతుందన్నారు.

ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సతీష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డిఎంహెచ్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు హైదరాబాద్ నుండి కార్యక్రమాన్ని ఆన్ లైన్‌లో పరిశీలించారు.

# బెల్ట్‌ల్లోనే కిక్కు?

మొదటి పేజీ తరువాయి..


నిబంధనలను తుంగలో తొక్కుతున్నారనే చర్చ జిల్లా వ్యాప్తంగా జోరుగా సాగుతోంది.

### వార్తలు రాస్తే ఏమవుతుంది? సిఐ ధీమా!

మద్యం సిండికేట్ నిర్వహణ, బెల్ట్ షాపుల అక్రమ దందాపై పత్రికల్లో, మీడియాలో వార్తలు వస్తున్నప్పటికీ సదరు అబ్కారీ సిఐ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. "వార్తలు రాస్తే ఏమవు తుంది.. చూసుకుందాం" అనే ధీమాతో వ్యవహరిస్తున్నట్లు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలను అతిక్రమించి, ఏకంగా ప్రభుత్వ మద్యం గోదాముల నుంచే నేరుగా బెల్ట్ షాపులకు బల్క్ లోడ్లు ఎలా సరఫరా అవుతున్నాయని వివరణ కోరేందుకు రిపోర్టర్లు ఫోన్ చేసినా కనీసం సమాధానం ఇవ్వని పరిస్థితి నెలకొంది.

### ఫోన్లో దొరకరు.. స్టేషన్లో ఉండరు

ప్రజా సమస్యలపై, అక్రమాలపై స్పందించాల్సిన సదరు ఎక్సైజ్ సిఐ అటు ఫోన్లలోనూ దొరకరు, ఇటు స్టేషన్‌లోనూ అందుబాటులో ఉండరని సమాచారం. తనకున్న ఆర్థిక బలం, అంగ బలం, రాజకీయ అండదండలను చూసుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల స్థాయిలో తనకు గట్టి పట్టు ఉందని, తనను ఎవరూ ఏమీ చేయలేరనే అహంకారంతోనే విలేకరుల ప్రశ్నలకు సైతం సమాధానం దాటవేస్తున్నట్లు స్పష్టమవుతోంది.ప్రభుత్వ ఆదాయానికి గండి.. పెచ్చరిల్లుతున్న అక్రమాలు కేవలం వైన్ షాపులు, బార్లలో మాత్రమే విక్రయించాల్సిన మద్యాన్ని ఊరూరా ఉన్న కిరాణా దుకాణాలు, పాన్ డబ్బాలు, బెల్ట్ షాపులకు తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఎక్సైజ్ అధికారుల అండదండలతోనే సిండికేట్ వ్యాపారులు ఎమ్మార్పీ కంటే అదనంగా రూ. 60 వరకు వసూలు చేస్తూ వినియోగదారుల జేబులు గుల్ల చేస్తున్నారు. యువత, కూలీలు ఈ మత్తుకు బానిసలై కుటుంబాలను రోడ్డున పడేస్తుంటే, అక్రమ సంపాదనతో అధికారులు, వ్యాపారులు



మాత్రం కార్లు, బంగళాలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో కోట్లకు పడగలెత్తుతున్నారు.

### ఉన్నతాధికారులు, ఏసీబీ స్పందించాలి

రాజకీయ బలం, అక్రమ సంపాదన చూసుకొని విర్రవీగుతున్న ఇలాంటి అధికారుల తీరుపై ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం స్థానిక తనిఖీలతో సరిపెట్టకుండా, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ అధికారులు రంగంలోకి దిగి సదరు సిఐ అక్రమ ఆస్తులపై, సిండికేట్ మామూళ్లపై సమగ్ర విచారణ జరపాలని ప్రజా సంఘాలు, మహిళా శక్తి డిమాండ్ చేస్తోంది.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక
మంగళవారం మే 19, 2026

## అడవిదేవులపల్లిలో ఘనంగా యూత్ వారోత్సవాలు ప్రారంభం

**అడవిదేవులపల్లి,అక్షిత ప్రతినిధి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న యూత్ వారోత్సవాలు సోమవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి.యువతలో ఆరోగ్య చైతన్యం,క్రీడాస్ఫూర్తి మరియు సామాజిక బాధ్యత పెంపొందించే లక్ష్యంతో యోగా కార్యక్రమం పాటు 2కే రన్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి ఎండి.మోసిన్ బిన్ అహ్మద్,తహసీల్దార్ రాగ్య నాయక్,మండల విద్యాశాఖ అధికారి వరలక్ష్మి,ఏపీఎం,స్థానిక పంచాయతీ



కార్యదర్శి దుర్గయ్య, గ్రామ సర్పంచ్ చిన్న రామయ్య, కార్యదర్శులు, యువకులు, క్రీడాకారులు మరియు విద్యార్థులు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అధికారులు మాట్లాడుతూ యువత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే యోగా,క్రీడలు ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సూచించారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన కార్యక్రమాలకు యువత చురుకుగా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు

## ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ మారథాన్‌కు భారీ స్పందన

**శివాజీ చౌక్ నుంచి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఉత్సాహంగా పరుగులు...**

**యోగా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి**

**నిర్మల్ అక్షిత బ్యూరో:**
ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా, వ్యాయామాలను ప్రతి ఒక్కరూ నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. "ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక" యువజన, క్రీడా వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం నిర్వహించిన "ఫిట్ అండ్ ఆక్టివ్ తెలంగాణ – మారథాన్ అండ్ ఫిజికల్ లిటరసీ" కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని శివాజీ చౌక్ (మంచిర్యాల చౌరస్తా) నుంచి ప్రారంభమైన మారథాన్, ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. యువత,




విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

అనంతరం ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ యోగా, శారీరక వ్యాయామం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. నిరంతర శారీరక శ్రమ ద్వారా అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవచ్చని, భవిష్యత్తులో అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. యోగా, ఎక్సర్‌సైజ్‌ల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, డివైఎస్‌ఓ శ్రీకాంత్ రెడ్డి, డిఈఓ భోజన్న, సిపిఓ జీవరత్నం, మునిసిపల్ కమిషనర్ రవి బాబు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కష్టాలను తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**చీకటాయిపాలెం ఐకెపి సెంటర్లో గన్ని బస్తాల కొరత లేదు..**

**టిఆర్ఎస్ నాయకులారా ఇకనైనా అసత్యపు ప్రచారాలు మానుకోండి..**

**గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ చిదురాల కృష్ణమూర్తి, పొడకంటి సరస్వతి శేఖర్**

**తొర్రూర్,మే18 అక్షిత ప్రతినిధి:** రైతుల కష్టాలను తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని చీకటాయపాలెం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ చిదురాల కృష్ణమూర్తి, పొడకంటి సరస్వతి శేఖర్‌లు అన్నారు.

చీకటాయిపాలెం గ్రామంలో గత రెండు రోజులుగా టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఐకెపి సెంటర్ నిర్వహణపై చేస్తున్న అసత్యపు ఆరోపణలపై గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్ స్పందిస్తూ... సోమవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తనిఖీ చేయడం జరిగింది. అనంతరం వారు సంయుక్తంగామాట్లాడుతూ....గ్రామంలోని




కొనుగోలు సెంటర్లో గన్ని బస్తాల కొరత లేదని టిఆర్ఎస్ పార్టీ నాయకులు కావాలనే రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, తొర్రూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి లా ఆదేశానుసారం తొర్రూర్ మండలంలో మన గ్రామానికి అధికంగా లారీలు రావడం మూలంగా పదివేల బస్తాలు కాంటాలు నిర్వహించి మిల్లులకు తరలించడం జరిగింది. మిల్లులోకి తరలించిన అన్ని బస్తాలలో ఏ ఒక్క రైతుకు కూడా కట్టింగ్ లేకుండా అన్లోడ్ జరిగిందని అన్నారు. రెండు రోజుల క్రితమే మరల పదివేల గన్ని బస్తాలు అందుబాటులోకి తేవడం జరిగింది. వీటిని కూడా సీరియల్ ప్రకారమే కాంటాలు నిర్వహించి ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని సెంటర్ ఇన్చార్జికి సూచించినట్లు తెలిపారు. అంతేకాకుండా సీరియల్ ప్రకారమే కొంతమంది రైతులకు సర్పంచ్ తానే దగ్గరుండి ఏ



గొడవలు లేకుండా గన్ని సంచులు ఇప్పియడం జరిగింది. కావాలనే టీఆర్ఎస్ పార్టీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని,ప్రతి విషయాన్ని పార్టీ పరంగా చూడకుండా గ్రామ అభివృద్ధికి తోడ్పడే విధంగా ఉండాలని అన్నారు.

అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షుడు బూరుగుల దస్తగిరి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో సెంటర్లలోకి ఒక్క లారీ కూడా రాలేని సందర్భంలో రైతుల సొంతంగా ట్రాక్టర్లు మాట్లాడుకుని మిల్లులోకి వెళ్తే, మిల్లర్లు ఒక ట్రాక్టర్ కి పది నుంచి 20 బస్తాలు కటింగ్ అవుతున్నాయని రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్న ఆరోజు కనీసం రైతుల పక్షంలో ఒక్క టిఆర్ఎస్ నాయకులు కూడా మాట్లాడలేదు కానీ ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రతి సెంటర్ కి ప్రభుత్వమే లారీలను పంపిస్తున్న, లారీలు రావట్లేదని అబద్ధపు మాటలు మాట్లాడడం, గన్ని బస్తాలు ఉన్న లేవని చెప్పడం రైతులు ప్రజలు గమనిస్తున్నారని, ఇప్పటికైనా ఈ చిల్లర రాజకీయాలు మానుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిన్నాల వేణు, వార్డు సభ్యులు వేల్పుగొండ వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె దయాకర్, వేల్పుగొండ చిన్న వెంకన్న,తండు యాకయ్య,సింగం దామోదర్, వేల్పుగొండ ఉప్పలయ్య, కొండ లింగయ్య, రైతులు కొండ కొమురయ్య,కొండ శ్రీశైలం, బూర్గుల దేవదానం, జీడిగంటి సోమయ్య, వేల్పుగొండ వెంకట్నర్సు తదితరులు పాల్గొన్నారు.

# బలహీన వర్గాలకు మేలు చేసే పార్టీ కాంగ్రెస్

**రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**కరీంనగర్, అక్షిత బ్యూరో:**

బలహీన వర్గాలకు మేలు చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మున్నూరు కాపు సంఘం కార్పొరేషన్ చైర్మన్ గా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి బాధ్యతలు చేపట్టి తొలిసారిగా కరీంనగర్ వచ్చిన సందర్భంగా కరీంనగర్ లోని ఇందిరా భవన్ లో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు.



ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ అన్ని వర్గాలను కలుపుకొని పోయే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని లక్ష్మణ్ అన్నారు. మంత్రి వర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సమన్యాయం జరిగే విధంగా మంత్రులను నియమించడమే ఇందుకు నిదర్శనమని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బలహీన వర్గాలకు మేలు చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ అని మంత్రి అడ్లూరి అన్నారు. బీసీలకు దేశంలో ఎక్కడా లేని విధంగా 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించడంతో పాటు ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం జరిగిందని మంత్రి అడ్లూరి గుర్తు చేశారు.

బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకునే ప్రభుత్వ వసతి గృహాల బిల్లులను తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతినెల రూ. 220కోట్లు చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నామని మంత్రి అడ్లూరి వివరించారు. బలహీన వర్గాల నేతగా బొమ్మ వెంకన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రత్యేక గుర్తింపు పొందారని ఆయన వారసునిగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి రాజకీయాల్లోకి వచ్చి ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తున్నారని మంత్రి అడ్లూరి అన్నారు. బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి రానున్న రోజుల్లో మరిన్ని మంచి పదవులు అలంకరించాలని కోరుకుంటున్నట్లు ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, సూడా చైర్మన్ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి

**సిఐటియు జిల్లా నాయకులు బండపల్లి శివరాములు**



**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా నాయకులు బండపల్లి శివరాములు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఆయన సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర కమిటీ ఎమ్మెల్యేలకు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని పిలుపునిచ్చింది అందులో భాగంగానే కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆశా వర్కర్లు ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద ధర్నా కు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు ఈ సందర్భంగా శివరాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్లతో వ్యక్తి చాకిరి చేయించుకుంటున్నాయని విమర్శించారు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు ఆశ వర్కర్లకు ఇచ్చిన వాగ్దానం అమలు చేయాలని ఫిక్స్ వేతనం 18000 ఇవ్వాలని ప్రమాద దీపం పిఎఫ్ ఈఎస్ఐ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని అన్నారు పని భారాన్ని తగ్గించాలని రాజకీయ వేధింపులు ఆపాలని అన్నారు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ఆనంద్ కుమార్‌కు అందజేశారు ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి యాదమ్మ జిల్లా నాయకురాలు వసంత వంగూరు మండల అధ్యక్షురాలు సుమతమ్మ తోటపల్లి పిహెచ్సి అధ్యక్షురాలు సుభద్ర నాగమణి హుస్సే నమ్మ కల్వకుర్తి పిహెచ్సి నాయకురాలు విమల వెల్దండ మండల నాయకురాలు హరి భాయ్ బాలమని లక్ష్మ మ్మ నీల చారగొండ మండల నాయకురాలు స్వర్ణలత రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# పోస్ట్ ఆఫీస్‌లో ప్రతి మనిషి ఇన్సూరెన్స్ చేయించుకోండి

**550 చెల్లిస్తే 10 లక్షల ఇన్సూరెన్స్ వర్తిస్తుంది**

**ఇన్సూరెన్స్ కట్టుకోలేని ప్రజలకు సొంతంగా కట్టించిన సర్పంచ్**

**హర్షం వ్యక్తం చేస్తున్న గడ్డంపల్లి గ్రామ ప్రజలు**

**గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్**



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:**

తెలకపల్లి మండల పరిధిలోని గడ్డంపల్లి గ్రామంలో గ్రామ ప్రజల సంక్షేమం కోసం పోస్ట్ ఆఫీస్ ద్వారా 550 చెల్లించి పది లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్ ప్రజలకు పిలుపునిచ్చారు.గ్రామ ప్రజలు అందరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని తెలియజేశారు. ఇన్సూరెన్స్ 550 రూపాయలు కట్టలేని పరిస్థితి ఉన్నటువంటి వారికి గ్రామ సర్పంచ్ సొంత ఖర్చుతో కట్టించడం జరిగింది. గడ్డంపల్లి గ్రామ ప్రజల భద్రత కోసం సొంత ఖర్చులతో పోస్ట్ ఆఫీస్ ద్వారా ఇన్సూరెన్స్ చేయించిన గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్ గారి గొప్ప మనసుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.పల్లె ప్రజల సంక్షేమం తన ధ్యేయంగా భావించి, తను నమ్మిన జనానికి అండగా నిలిచిన నాయకుడు!స్వార్థం ఎరుగని మనసుతో, సొంత ఖర్చు వెచ్చించి,పోస్ట్ ఆఫీస్ ద్వారా భరోసానిచ్చిన సర్పంచి ఆపదొస్తే ఆదుకునే దిక్కుగా మారి,గడప గడపకూ ధీమాను పంచిన సర్పంచ్!వెన్నెల శేఖర్ పేరుకు తగ్గట్టే.గ్రామ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన చల్లని సర్పంచ్ వెన్నెల శేఖర్ కు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# భద్రతా ప్రమాణాలతో పాఠశాల భవనాలు నిర్మించాలి

**గ్రామీణ విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా సౌకర్యాలు**

**నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి కల్పన ప్రభుత్వ లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:**

నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణంలో తరగతి గదులు, వసతి గృహాలు, ప్రయోగశాలలు, భోజనశాల, పారిశుధ్య సదుపాయాలు తదితర అంశాలను నిశితంగా కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ...., గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యా సౌకర్యాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ విద్యార్థులు కూడా నగర స్థాయి విద్యా అవకాశాలను పొందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మాణ పనులను అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం, ఆలస్యం చోటుచేసుకోకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. నిర్మాణ పనుల పారదర్శకత కోసం పనుల ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

పాఠశాల భవన నిర్మాణంలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రతి గది విద్యార్థులకు అనుకూలంగా, సౌకర్యవంతంగా ఉండేలా నిర్మించాలని, ముఖ్యంగా హాస్టల్ గదులు, తాగునీటి వసతి, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, విద్యుత్ సదుపాయాలు, క్రీడా మైదానాలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.



రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నిర్మాణ పనులను పూర్తి చేసి విద్యార్థుల తరగతుల నిర్వహణకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, భద్రతా, ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## త్రిపురారం మండల కేంద్రంలోని
# ఉపాధి హామీ కూలీల అవస్తలు

**త్రిపురారం అక్షిత న్యూస్:** త్రిపురారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలు దాహం తీర్చుకునేందుకు మంచినీళ్ళు లేక ఇబ్బందులు పడుతున్న కూలీలు చెట్లను ఆసరా చేసుకొని సేదతీరుతూ ఈ కె వై సి చేయించుకుంటూ మండుటెండల్లో అవస్తలు.మండుటెండలోనే ఉపాధి



హామీ పనులు జరుగుతున్నాయి. పని జరిగే ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలన్న నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. సేద తీరేందుకు నీడ, దాహం తీర్చుకునేందుకు నీళ్లు లేక కూలీలు అవస్థలు పడుతున్నారు. గాయాలైతే చికిత్స అందించేందుకు ఫస్ట్ ఎయిడ్‌కిట్లు కూడా అందుబాటులో లేవు... మధ్యాహ్నం అవుతున్న అయిపోని ఈ కె వై సి లు ఎండలోనే అవస్తలు పడుతున్న ఉపాధి హామీ కూలీలు . కనీస వసతులు కల్పించాలంటున్న కూలీలు..

## రామన్నపేట మార్కెట్ యార్డ్ ఎదుట
# రోడ్డుపై రైతుల ధర్నా

**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** రామన్నపేట మార్కెట్ యార్డ్‌లో ఒక నెల, నెల పైన పోసిన వడ్లను కొనుగోలు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.అదేవిధంగా తూకం విషయంలో కూడా అన్యాయం జరుగుతోందని, ఒక్కో బస్తాకు కేజీ నుంచి కేజీన్నర వరకు అధికంగా తూకం వేస్తున్నారని రైతులు వాపోతున్నారు. అలాగే ప్రతి బస్తాకు లారీ ఖర్చుల పేరుతో అదనంగా రెండు రూపాయలు



వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఆరుకాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే సమయంలో ఇలాంటి అదనపు భారాలు మోపడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో సిలార్‌పల్లిలో
# సీసీ రోడ్ పనులు ప్రారంభం

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మున్సిపాలిటీలోని 6వ వార్డులో సోమవారం కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ మాజీ కౌన్సిలర్ చిగుల్లపల్లి సతీష్‌తో కలిసి పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి సహకారంతో మంజూరైనా సీసీ



రోడ్ పనులను ప్రారంభించారు సిలార్‌పల్లి అభివృద్ధికి అన్ని విధాలు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పుట్ట రేణుక రాజశేఖర్ నాయకులు శ్యాం సుంధర్ రెడ్డి,గుర్రాల జంగారెడ్డి,పాండు రంగా రెడ్డి, పుట్ట వెంకటయ్య, పెద్ద రాంరెడ్డి, బీమయ్య,జంగయ్య,దున్న భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఒండ్రు మట్టిని వ్యవసాయ పొలాలకు తరలించుకోవాలి

**ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున జాగ్రత్తగా ఉండాలి**

**గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** తెలకపల్లి మండల పరిధిలోని గడ్డంపల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనిలో భాగంగా సోమవారం ఒండ్రు మట్టి పనులు గ్రామ సర్పంచ్ వెన్నెల శేఖర్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒకరు ఉపాధి హామీ పథకంలో పాల్గొని చెరువులో ఉన్న ఒండు మట్టి వ్యవసాయ పొలాలలోకి తరలించుకుంటే పంటలు



బాగా పండుతాయి అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రతి రైతు వ్యవసాయ పొలాలలోకి వండు మట్టి తరలించాలని కూలీలకు సూచించారు. అదేవిధంగా కూలీలు ఉదయం ఆరు గంటలకి పనికి వెళ్లి 11 గంటలకు ముగించాలని ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు ఇబ్బంది పడవద్దని కోరారు. ఉపాధి హామీ పథకం దగ్గర త్రాగునీరు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య ..గ్రామ పెద్దలు వెంకటస్వామి, మేట్ లు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ఎన్ఎస్పి పాత కాలువ దుస్థితిపై బీజేపీ ఫైర్

**నేలకోండపల్లి ప్రజావాణిలో కలెక్టర్‌కు బీజేపీ వినతి**

**-15 మంది లస్కర్లు ఉండి కాలువ శుభ్రం చేయరా...?**

**ఖమ్మం/అక్షిత బ్యూరో:**

నేలకొండపల్లి మండల పరిధిలోని ఎన్ఎస్పి పాత కాలువ దుస్థితిపై భారతీయ జనతా పార్టీ నేలకొండపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నేలకోండపల్లి మండలంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న ఎన్ఎస్పి పాత కాలువలో పేరకపోయిన నాచు తుంగ కాలువకు ఇరువైపులా విపరీతంగా చెట్లు పెరిగిపోయాయి. మరో 15 రోజుల్లో వ్యవసాయ సీజన్ మొదలు కానున్నా అధికారుల నిర్లక్ష్యంతో చెత్తా చెదారం పేరుకుపోయి చివరి ఆయకట్టు రైతులకు నీరు అందక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో 15 మంది లస్కర్లు ఉన్నప్పటికీ చెత్త నాచు క్లియరింగ్ చేయకుండా



కాలం వెళ్లదీస్తున్నారు. రైతుల సమస్యలను పట్టించుకోని ఇరిగేషన్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ శ్రేణులు డిమాండ్ చేశారు. చివరి భూముల వరకు సాగునీరు అందేలా వెంటనే కాలువలు బాగు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మన్నే కృష్ణారావు మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు మండల ఉపాధ్యక్షులు కొండా హర్షవర్ధన్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు పుట్టా సత్యనారాయణ మండల అధికార ప్రతినిధి సూరెపల్లి జ్ఞానరత్నం మండల నాయకులు మూడు రమేష్ ఎలిగేటి గిరి బీజేపీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పిట్టల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.





# సనాతన ధర్మంలో గోవు మన కామధేనువు

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**పెంజర్లలో శ్రీ అనంత పద్మనాభ స్వామి టెంపుల్‌లో గోశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మన్నే జీవన్ రెడ్డి**

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:**

సనాతన ధర్మంలో గోవును కామధేనువుగా భావిస్తారనీ గోశాలలలో గోసేవ చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని అలాగే, గోశాలల నిర్వహణ ద్వారా స్థానికులకు మరియు రైతులకు ఉపాధి లభిస్తుందనీ షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామంలో శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయంలోని గోశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు మన్నే జీవన్ రెడ్డి, ఈ సందర్భంగా ఆలయ కమిటి బెజవాడ అనిత రెడ్డి మాజీ జడ్పిటిసి శ్యామ్ సుందర్ రెడ్డి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఉమ్మడి మండల మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ , గ్రామ సర్పంచ్ జగన్,కొమ్ము కృష్ణ సుదర్శన్ గౌడ్ సిద్దాపూర్ శేఖర్ రెడ్డి, అంబటి ప్రభాకర్ విగ్నేష్ రెడ్డి కుమారస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# గజ్జ కట్టి ప్రజలను చైతన్యపరచిన తోటకూర సైదయ్య

**-సైదయ్య పోరాటాలు మరువలేనివి..**

**-కామ్రేడ్ సైదయ్య 23వ మహాసభలో..**

**-సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి.**

**-పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు యర్రం శెట్టి వెంకట రామారావు**

**భద్రాచలం అక్షిత న్యూస్:**

ప్రజా సమస్యలపై గజ్జ కట్టి ప్రజల్ని మేల్కొలిపి ఉద్యమాల బాట పట్టించిన కళాకారుడు కామ్రేడ్ తోటకూర సైదయ్య అని సిపిఐ భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. సోమవారం పట్టణంలో 14వ వార్డు కొత్త కాలనీలో సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ సభ్యులు చాట్ల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన తోటకూర సైదయ్య 23వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. నాటి చంద్రబాబు నాయుడు ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ భుజాన గొంగళి వేసి కాళ్లకు గజ్జ కట్టి గ్రామ గ్రామాన కళారూపాలను తోటకూర సైదయ్య నాయకత్వంలో కళారూపాలు ప్రదర్శించారని అన్నారు. ఏజెన్సీ గద్దర్ అని కీర్తించబడ్డ సైదయ్య లేని రోడ్డు ప్రజానాట్యమండలికి తీరనిదని అన్నారు. ఒకే దేశం ఒకే మతం అనే నినాదంతో ఎన్డీఏ ప్రభుత్వం పాలన కొనసాగిస్తుందని గడ్డం స్వామి ఆరోపించారు. సర్ పేరుతో దేశంలో అనేక రాష్ట్రాలలో మైనార్టీ ఓట్లను తొలగించిన మోడీ తెలంగాణలో సైతం ఓట్లను తొలగించే కుట్రలు ప్రారంభిస్తున్నారని ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. ఇందిరమ్మ రెండో విడతలోనైనా నిజమేనా అర్హులకు ఇల్లు మంజూరు చేయాలని గడ్డం స్వామి డిమాండ్ చేశారు.

యర్రం శెట్టి వెంకట రామారావు...

అశోక్ నగర్ కొత్త కాలనీ ఏర్పడ్డ ప్రారంభంలో కనీస మౌలిక సదుపాయాల కోసం సైదయ్య అనేక పోరాట నిర్వహించారని ఎర్రం శెట్టి వెంకట రామారావు అన్నారు. కనీస సౌకర్యాలు కూడా లేని ఆ రోజులలో తోటకూర సైదయ్య పోడుతూరి పెద్దరాజు వంటి సిపిఐ ఎం నాయకులు చేసిన పోరాటం ఫలితంగానే కాలనీకి రహదారులు విద్యుత్ సౌకర్యం కలిగిందని అన్నారు. ఓవైపు ప్రజా కళాకారుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్న మరోవైపు కాలనీ అభివృద్ధి కోసం సైదయ్య కృషి చేశారని అన్నారు. దేశంలో రాష్ట్రంలో నేటి రాజకీయాలను చూస్తుంటే ఈ దేశం ఎటువైపు వెళుతుందో అర్థం కాని పరిస్థితిలనుకుంటుందని అన్నారు. ఒక మైనర్ బాలికను అత్యాచారం చేసిన నిందితుని కాపాడేందుకు కేంద్ర మంత్రులు రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం పోరాడుతున్నారంటే దేశంలో ఆడపిల్లల రక్షణ ఏ పరిస్థితులలో ఉందో స్పష్టమవుతుందని వెంకట్రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ అమెరికా అధ్యక్షుడికి



బానిసగా మారి రష్యా నుండి గ్యాస్ చమురు దిగుమతి చేసుకోకుండా ఈరోజు దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టారని ఆరోపించారు. మోడీ మాత్రం గంటకు పదివేల లీటర్ల ఇంధనం ఖర్చయ్యే విమానంలో పయనిస్తూ ప్రజలను మాత్రం పొదుపు చేయాలనటం ఎంతవరకు సబబు అని అన్నారు. దేశంలో రాష్ట్రంలో పెరిగిపోతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల నిర్ణయించుటమే తోటకూర సైదయ్య కి ఇచ్చేనిజమైన నివాళి అని అన్నారు. పింఛన్లు మంజూరు కాక నాలుగేళ్లుగా వృద్ధులు వితంతువులు ఎదురుచూస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొత్త ఆసరా పెన్షన్ లను మంజూరు చేయాలని వెంకట్రామారావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారెల్లి సంతోష్ కుమార్ పట్టణ కమిటీ సభ్యులు కుంజా శ్రీనివాస్ కొరడా శ్రీనివాస్ అజయ్ కుమార్ శాఖ కార్యదర్శులు గోవర్ధన ఝాన్సీ ఎర్రంశెట్టి పూర్ణిమ డివైఎఫ్ఐ కార్యదర్శి సతీష్ బాబు సీనియర్ నాయకులు ఎర్రం శెట్టి సత్యవతి బొట్టు ఆదిలక్ష్మి జానకమ్మ సుశీల లంబ రవణ సైదయ్య కుటుంబ సభ్యులు సందీప్ ప్రియా జయసాగర్ శ్రీ లక్ష్మీ తదితరులు పాల్గొని సైదయ్య స్తూపం వద్ద నివాళులర్పించారు.





# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### - అదనపు కలెక్టర్ ఎం డెవిడ్

**ఆసిఫాబాద్ అక్షిత బ్యూరో:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం డెవిడ్ అన్నారు . సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ,అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమములో వచ్చే ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు గత ప్రజావాణిలో అందిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దరఖాస్తు దారుల నుండి అర్జీలు స్వీకరిం చారు. ఆసిఫాబాద్ మండలంలోని రాహపల్లి గ్రామానికి చెందిన పిడుగు మొండయ్య తనకు సెంట్రింగ్ మేస్త్రి పనుల పరికరాల కొనుగోళ్ళు కొరకు పి ఎం జి పి రుణము ఇప్పించుట గురించి. రెబ్బెన మండలంలోని గోలేటికి చెందిన గుగులోత్ స్వప్న గోలేటి శివారులో ఉన్న సాగు భూమికి నీటి సౌకర్యం కల్పించడం కొరకు మోటారు పంపు మంజూరి దరఖాస్తు. కౌటాల మండల కేంద్రానికి చెందిన ఎలుములె జ్ఞానేశ్వర్ మొగడ్ ధగడ్ క్రాస్ రోడ్డ్ వద్ద డ్రైనేజి నిర్మించుట గురించి దరఖాస్తు లింగాపూర్ మండలంలోని మొతిపటార్ గ్రామానికి చెందిన జాదవ్ లలిత ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేదుకు అటవీ శాఖ అనుమతులు ఇప్పించుట గురించి దరఖాస్తు .రెబ్బెన మండలం నవేగం గ్రామనికి చెందిన కమటి శంకర్ తనకు దివ్యంగా పించన్ ఇప్పించుట గురించి దరఖాస్తు, రెబ్బెన మండలం గోలెటి చెందిన కట్ల రజిత తనకు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరి గురించి దరఖాస్తు . జిల్లా కేంద్రానికి చెందిన ఎం డి జమిల్ హుస్సేన్ తనకు ఫ్రీడం ఫైటర్ సర్టిఫికేట్ మంజూరి గురించి దరఖాస్తు జైనూర్ మండలం దబోలి గ్రామానికి చెందిన కొడప మిరభాయి తనకు రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు .



# అగ్ని ప్రమాదాలపై మాక్ డ్రిల్

**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా విపత్తు నిర్వహణ - 2026 కార్యక్రమంలో అగ్ని ప్రమాదలపై మాక్ ఎక్సర్‌సైజ్‌ను రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లోని ఐఓసిలో అగ్నిమాపక శాఖ అధ్వర్యంలో సోమవారం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి పాల్గొని వివిధ డెమోలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, అగ్ని ప్రమాదల సమయంలో ఎదురయ్యే అత్యవసర పరిస్థితులను ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికారులు సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య



సమన్వయం, స్పందన వ్యవస్థలు, సహాయక చర్యలను సమీక్షించి మరింత మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దే శమని పేర్కొన్నారు. ప్రమాదల సమయంలో అధికారులు అప్ర మత్తంగా ఉండి ముందస్తు ప్రణాళికతో పని చేయాలని సూచించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగంగా సహాయక చర్యలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. మాక్ డ్రిల్ ద్వారా విపత్తు నిర్వహణలో లోపాలను గుర్తించి స్పందన వ్యవస్థను మరింత బలోపేతం



చేయవచ్చని అన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాస ఏర్పాట్లు, శాఖల సమన్వయం తదితర అంశాలపై అధికారులు ప్రత్యక్ష సాధన నిర్వహించారు.

అగ్ని ప్రమాదలలో గాయపడిన బాధితులకు అత్యవసర పరిస్థితుల్లో ఎలా ప్రాథమిక చికిత్స అందించాలో, అలాగే అగ్ని ప్రమాదలలో చిక్కుకున్న వారిని సురక్షితంగా ఎలా రక్షించాలో డెమో ద్వారా అవగాహన కల్పించారు. సహాయక బృందాలు ప్రాణాపాయ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రెస్క్యూ పరికరాల వినియోగం, బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించే విధానాలను ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని జూమ్ మీటింగ్ ద్వారా హైదరాబాద్‌లోని విపత్తు నిర్వహణ అధికారులు మానిటరింగ్ చేశారు.

ఈ కార్యక్రమంలో షాద్ నగర్ ఆర్డీఓ సరిత, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి మురళి మనోహర రెడ్డి, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీలక్ష్మి, ఐఓసిఎల్ అధికారులు, పోలీసు అధికారులు,అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు అండగా మాతృదేవోభవ చారిటబుల్ సొసైటీ

### సొసైటీ కార్యదర్శి ఓరుగంటి రమాదేవి

**కోదాడ, అక్షిత ప్రతినిధి:** మాతృదేవోభవ చారిటబుల్ సొసైటీ పేదలకు అండగా ఉంటుందని సొసైటీ కార్యదర్శి ఓరుగంటి రమాదేవి అన్నారు సోమవారం ఓరుగంటి రమాదేవి వెంకటేశ్వర్లు వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక శనగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల అనాధాశ్రమం లోని పిల్లలకు అల్పాహారం అందజేశారు. అదేవిధంగా




కోదండ రామాలయం ఆవరణలో బీద కుటుంబానికి నెలకి సరిపడా నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ అనాధ పిల్లల మధ్య వివాహ వార్షికోత్సవం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, సమాజంలోని అనాధ పిల్లలకు, బీదవారికి తమ వంతు చేయూతనివ్వాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ,కార్యదర్శి ఓరుగంటి రమాదేవి, కోశాధికారి ఇమ్మడి సతీష్ బాబు, డైరెక్టర్లు వంకాయల స్వాతి, బండారు శ్రీనివాస రావు, వెంపటి ప్రసాద్, ఓరుగంటి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం..

### రూ.14.45 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**కాజీపేట్, అక్షిత ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 48 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 14,45,500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద,



మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ సంక్షేమ పాలన అందిస్తోందన్నారు. అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అత్యవసర వైద్య సహాయం అందిస్తూ ప్రభుత్వం మానవతా దృక్పథంతో పనిచేస్తోందని తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హుల దరి చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్, మహిళా సంక్షేమ పథకాల ద్వారా సామాన్య ప్రజలకు భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి కొనసాగుతుందని ఎమ్మెల్యే నాయిని స్పష్టం చేశారు.

www.aakshitha.com People's voice అక్షిత జాతీయ దినపత్రిక AKSHITHA NATIONAL DAILY
మంగళవారం మే 19, 2026

# కేంద్రప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఆంజనేయులు

**కల్వకుర్తి అక్షర ప్రతినిది:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, సిఎన్జి ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.ఆంజనేయులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ చౌరస్తా వద్ద




సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారాన్ని మోపిందని విమర్శించారు. ఒకవైపు ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని సూచిస్తూనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలపై కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.కార్పొరేట్ సంస్థలు, పెద్ద పెట్టుబడి దారులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం విధానాలు అమలు చేస్తూ దేశ ప్రజలను అప్పుల్లోకి నెట్టుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, కార్మికులు, కూలీలు, ఉద్యోగులకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకొస్తూ యజమానులకు అనుకూల విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు.

పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటు తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విరమించి పెంచిన ఇంధన ధరలను తగ్గించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఏపీ మల్లయ్య, పి.పరశురాములు, ఎంప్లాయిస్ పత్రిక ఎడిటర్ కే.వెంకటేశ్వర్లు,సిపిఎం నాయకులు శివరాములు, చెన్నయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, సివిల్ సప్లై గోదాం హామాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలయ్య, యాదయ్య, నరేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# రామన్నపేటలో ఘనంగా బీరప్ప దేవుని కళ్యాణ మహోత్సవం

**రామన్నపేట,అక్షిత ప్రతినిధి:**
రామన్నపేట కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బీరప్ప దేవుని కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఒగ్గు



పూజారులు, కురుమ కుల పెద్దలు మరియు కురుమ కులస్తులు అందరూ కలిసి బీరప్ప దేవుని కళ్యాణాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు.

ఈ వేడుకలకు గ్రామస్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. కళ్యాణ మహోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుమ కులస్తులు విశేష సహకారం అందించారు.

ఈ కార్యక్రమానికి పెద్ద కురుమ, షెల్వోజి,గ్రామ సర్పంచ్ గరిక సత్యనారాయణతో పాటు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై ఆమ్ ఆద్మీ పార్టీ ఫిర్యాదులు, నిరసనలు

## ఫంక్షన్లలో ఉత్సవాలలో డీజేలను నిషేధించాలని కలెక్టర్‌కి ఫిర్యాదు

**ఖమ్మం/అక్షిత బ్యూరో:**
ఖమ్మం జిల్లాలో ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కమిటి ఆధ్వర్యంలో పలు పిర్యాదులు సమస్యల నిరసన కార్యక్రమలు చేసారు. సీపీ కార్యాలయంలో సీపీ జిల్లా కలెక్టర్‌ని కలిసి ఖమ్మం జిల్లాలో డీజే సౌండ్స్ వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఉత్సవాలలో ఫంక్షన్ లలో డీజేలు వాడకుండా చూడాలని కోరారు. లచ్చగూడెం చింతకాని మండలంలో జరిగిన ఘటనతో పలు జిల్లాలో డీజే వలన ఇబ్బంది పడుతున్నారని లచ్చగూడెం బాధితులతో కలిసి పిర్యాదు చేసారు. జిల్లాలో డీజేల నియంత్రణ చర్యలు తీసుకోవాలని పిర్యాదు చేశారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయంలో ఆప్ పార్టీ కలెక్టర్‌ను కలిసి గ్రీవెన్స్లో నేషనల్ హైవే రోడ్డు సైడ్‌రోడ్డు నుండి వర్షం నీరు డ్రైనేజి లేకపోవడంతో నీళ్లు పంట భూములలోకి వెళ్లడంతో పంటలు నష్ట పోతున్నారు. కావున డ్రైనేజీని నిర్మించి రైతులును ఆదుకోవాలని కోరారు. మరొక పిర్యాదులో ఎన్ఎస్పి కాలువల్లో భారీగా పేరుకు పోయిన నాచు పిచ్చి మొక్కలు చెత్త చెదారంను తొలగించాలని పిర్యాదు చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన డిజిల్ పెట్రోల్ ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు డిజిల్ ధరలతో రైతులు ఇబ్బంది పడు తున్నారు.




డీజిల్‌పెరగటంతో వ్యాపారంపై ప్రభావంతో ధరలు పెరిగితు న్నాయి. మహిళలు పార్టీ నాయకులతో కలెక్టర్ ఆఫీస్ దగ్గర నిరసన కార్యక్రమం చేపట్టినారు. ఈ కార్యక్రమంలో ఆప్ పార్టీ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు ఉపాధ్యక్షులు పసుమర్తి శ్రీనివాస్, ట్రెజరర్ కనపూడి రవి కుమార్ పరుచూరి నర్సింహారావు, నవీన్ పాల్గొన్నారు.

# కుమ్మరి సంఘం వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా చిగురు మామిడి ప్రభాకర్



**కాశీబుగ్గ, అక్షత న్యూస్:**
వరంగల్ నగరం చెందిన చిగురు మామిడి ప్రభాకర్ తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల సంఘం నూతన జిల్లా కమిటీలో ప్రాధాన్యత కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు ఆకారపు మోహన్ ఆదేశాల మేరకు చిగురుమామిడి ప్రభాకర్ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగినది. ప్రభాకర్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నియమించి నందుకు రాష్ట్ర కమిటీకి ఆకారపు మోహన్‌కు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూనే గ్రామ కమిటీలు, మండల కమిటీలు పూర్తి చేస్తానని అన్నారు.

# ఉపాధి హామీ పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలి

## గ్రామాభివృద్ధికి ఉపాధి హామీ పథకం కీలకం

## జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని శ్రీపురం గ్రామంలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ పరిశీలించారు. గ్రామ పరిధిలో చేపడుతున్న చెరువు పూడిక తీత పనులను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసిన కలెక్టర్ పనుల పురోగతి, నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలతో మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వేతనాలు, పని పరిస్థితులు, తాగునీరు తదితర సౌకర్యాలపై వివరాలు సేకరించారు. గ్రామం నుంచి సుమారు 100 మంది ఉపాధి హామీ కూలీలు ఉదయం వేళలోనే పనులకు హాజరై





పనులు ప్రారంభించడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ... గ్రామాభివృద్ధి పనులతో పాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు పేద కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

ప్రతిరోజూ అధిక సంఖ్యలో కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరై ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. చెరువుల పూడిక తీత పనులు గ్రామాల అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని, ఈ పనుల ద్వారా చెరువుల నీటి నిల్వ సామర్థ్యం పెరగడంతో పాటు భూగర్భ జలాలు మెరుగుపడి రైతులకు సాగునీటి సమస్యలు తగ్గుతాయని తెలిపారు. పూడిక తీత వల్ల వ్యవసాయ భూముల సారవంతత కూడా పెరుగు తుందని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది బలాన్నిస్తుందని చెప్పారు.

ఉపాధి హామీ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పనుల అమలులో పారదర్శకత ఉండాలని, ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. పనుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు.

గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా కొనసాగుతున్నాయని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీడీవో చెన్నమ్మ, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక

మంగళవారం మే 19, 2026

## సుద్ధకల్ గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులను

# పరిశీలించిన కల్వకుర్తి ఎంపీడీవో గాలి యాదయ్య

**కల్వకుర్తి, అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండలము లోని సుద్ధకల్ గ్రామానికి కల్వకుర్తి ఎంపీడీవో గాలి యాదయ్య గ్రామాన్ని సందర్శించి గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఒండ్రు మట్టి( సిల్టు) పనుల లొకేషన్ విజిట్ చేసి పనులను పరిశీలించెనైనది ఉపాధి కూలీలకు ఎన్ ఎంఎంఎస్ ప్రాధాన్యత గురించి వివరించి అధిక సంఖ్యలో హాజరు ఆగుటకు కోరనైనది. ఎండ తీవ్రంగా ఉన్నందున ఉదయం తొందరగా వచ్చి పనులు చేసి 2వ అటెండన్స్ వరకు ఉండి వెళ్ళాలి అని కోరినాను... పనులు జరిగే ప్రదేశములో కూలీలకు టెంట్, త్రాగు నీరు, ఓఆర్ఎస్ పాకెట్స్ ఏర్పాటు చేయనైనది అదేవిధంగా గ్రామములోని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను కలసి ఇండ్ల నిర్మాణం శీఘ్రముగా పూర్తి చేసి జూన్,2న గృహప్రవేశాలు చేయుటకు సిద్ధంగా ఉండాలి అని కోరనైనది



ఎంపీడీవో యాదయ్య తో పాటు సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి సిబ్బంది ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ప్రతిభావంతులైన క్రీడాకారులకు పెట్టింది పేరు మెదక్ జిల్లా

**మెదక్, అక్షిత బ్యూరో:**
నేటి నుండి వారం రోజులపాటు జిల్లా మండల స్థాయిలలో యువజన క్రీడా, మరియు పర్యాటక వారోత్సవాలు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీమ సింగ్ తెలిపారు.వ్యాయామాలతో...శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యంమని మానసిక ప్రశాంతత, ఆరోగ్యం,ఓర్పు, సహనం పెంపు పెరుగుతుందని చెప్పారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లొ భాగంగా సోమవారం రోజున 18 నుండి 23 వరకు ఘనంగా యువజన క్రీడా పర్యాటక వారోత్సవాలు జరిగాయి. యువజన, కడల పర్యాటక వారోత్సవాల సందర్భంగా జిల్లా యువజన,క్రీడా శాఖ ఆధ్వర్యంలో మెదక్ పోస్ట్ ఆఫీస్ సర్కిల్ నుండి ధ్యాన్చంద్ స్టేడియం వరకు నిర్వహించిన 5కే రన్ ను అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు,జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు,క్రీడాకారులు క్రీడాభిమానులుతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జెండా ఊపి ప్రారంభించారు.ధ్యాన్ చంద్ చౌరస్తా వరకు సాగిన ఈ రన్ అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడానికి మరియు స్థానిక పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించడానికి క్రీడా పర్యాటక వారోత్సవాలను జిల్లా మండల స్థాయిలలో ఘనంగానిర్వహిస్తున్నామన్నారు మెదక్ జిల్లాలో చూడ చక్కని పర్యాటక ప్రాంతాలకు నెలవుగా. టూరిజం స్పాట్‌గా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు,అధికారులు ప్రజల సహకారంతో జిల్లా పాలనను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.ముఖ్యంగా యువత దైనందిక జీవితంలో మానసిక, శారీరక, ఆరోగ్యానికి, పరిరక్షణకై అందరు పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రతీ రోజూ వాకింగ్,రన్నింగ్ ప్రక్రియ..మన శారీరక ఓర్పును, మానసిక దృఢత్వాన్ని పరీక్షించే ఒక గొప్ప క్రీడాంశమని తెలిపారు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించి,ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని,రోగనిరోధక శక్తిని మెరుగుపరచడమే కాకుండా మానసిక ఒత్తిడిని తగ్గించి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ ఇంత ఘనంగా 5 కె రన్ కార్యక్రమం నిర్వహించినందుకు యువజన క్రీడల నిర్వహణ శాఖ యంత్రాంగాన్ని అభినందించారు. యువత జట్టుగా క్రీడలలో పాల్గొనడం ద్వారా స్నేహభావం పెంపొందడంతో




పాటు ఈర్ష్యా దేశాలను పక్కనపెట్టి క్రమశిక్షణ గల జీవనశైలి వారికి అలవరుతుందని క్రీడాకారులకు నెలవు అనే నినాదంతో క్రీడాకారులకు క్రీడలలో తర్ఫీదునిస్తూన్నరు.ఈ కార్యక్రమంలో యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, సైన్స్ అధికారి రాజిరెడ్డి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి మధు సూదన్, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, క్రీడా సంఘాల నాయకులు, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, చంద్రమోహన్, వినోద్, మనోహర్, దేవేందర్ రెడ్డి. యన్.సి.సి. క్యాడెట్స్, క్రీడాకారులు యువకులు సుమారు 300 లకు పైగా పాల్గొన్నారు.

# కళారులకు సంక్షేమ పథకాలు, పెన్షన్లు అందించాలి

**కరీంనగర్, అక్షిత బ్యూరో:**
సమాజంలోని అన్ని రంగాలలో ఉన్న కళాకారులను గుర్తించి వారికి ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అందించడంతో పాటు వారందరినీ ఆదుకొనుటకు పెన్షన్లు ఇవ్వాలని తెలంగాణ ప్రజానాట్యమండలి కరీంనగర్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి వరుకోలు సదానందం, దుడ్డేల సమ్మయ్య కోరారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ లో తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర 4వ మహసభల వాల్ పోస్టర్స్ ను సదానందం,సమ్మయ్యతో పాటు కళాకారులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సదానందం,సమ్మయ్య మాట్లాడుతూ ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవమైన మే 25వ తేదీని పురస్కరించుకొని తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర 4వ మహా సభలు మే 25,26వ తేదీలలో రెండు రోజుల పాటు హైదారాబాద్ లో జరిగనున్నాయని ఆ మహాసభలను విజయవంతం చేయడానికి జిల్లా నుండి పెద్దఎత్తున కళాకారులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కళాకారులు పాటలు పాడుతున్నారని, సంస్కృతి, సాంప్రదాయాలను, సామాజిక స్పృహ కలిగించే పాటలు పాడుతూ ప్రజలను చైతన్య వంతం చేస్తున్నారని,అంతరించి పోయే కళలను కనుమరుగు కాకుండా చేసేది కేవలం కళాకారులేనని అలాంటి కళలను, కళాకారులను




కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ప్రజా కళాకారులు కొంత మంది మాత్రమే ఉంటారని,కళ కాసుల కోసం కాదు ప్రజల కోసమని పాడే కళాకారులే ప్రజానాట్య మండలి వారని అన్నారు. జిల్లాలో అనేక మంది కళాకారులు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,జానపద,యక్షగాన,బుర్ర కథ,ఒగ్గు కథ, వీధి బాగోత కళారుల బ్రతుకులు చాలా దుర్భరంగా ఉన్నాయని ప్రభుత్వం వారిని గుర్తించాలని కళాకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్లు,ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇవ్వాలని సదానందం,సమ్మయ్య ప్రభుత్వాన్ని కోరారు.వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా ఉపాధ్యక్షురాలు కెంసారం కోమల, సహాయ కార్యదర్శులు జక్కి మంజుల,గుర్రం సదానందం,కోశాధికారి బోలుమల్ల రాజమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు దుడ్డేల రవి,సముద్రాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి

### లింగాల తాసిల్దార్ బి.వెంకటేష్

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు లింగాల తాసిల్దార్ బి వెంకటేష్ తెలిపారు. సోమవారం లింగాల తాసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ఇటీ ప్రజావాణిలో ఒక దరఖాస్తు స్వీకరించినట్లు తెలిపారు. అట్టి దరఖాస్తు త్వరలో విచారణ చేపట్టి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ ప్రజా వారి కార్యక్రమంలో, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా ఇందిరా. ఐకెపి ఎపిఎం విజయ. పశు వైద్య అధికారి ప్రియాంక. పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసులు విద్యాశాఖ నుండి సాయి. సీనియర్ అసిస్టెంట్ తిరుపతమ్మ, జిపిఓ శివ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం దృష్టికి ఆశావర్కర్ల సమస్యలు

### - ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

**మానకొండూర్, అక్షిత:**
ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళతానని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.సోమవారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్ లో ఆశా వర్కర్లు అందించిన వినతిపత్రాన్ని ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తేవడమే కాకుండా న్యాయమైన కోర్కెలు తీర్చేందుకు



తనవంతు తోడ్పాటునందిస్తానన్నారు. ఇదిలా ఉండగా, ఆశా వర్కర్ల వేతనాలకు 18వేల రూపాయలకు స్థిరీకరిస్తూ ప్రతినెలా ఒకటవ తేదీన చెల్లించాలని ఆ వినతిపత్రంలో ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాల నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నామని, ఇప్పటి వరకు వేతన స్థిరీకరణ చేయని కారణంగా అన్యాయానికి గురవుతున్నామని, 18వేలకు వేతనాలు పెంచాలని, అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆశా వర్కర్లకు నేతనాలు పెంచడమే కాకుండా ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశావర్కర్లు కోరారు. అంతేకాకుండా 50 లక్షల ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.5 లక్షలు చెల్లించాలని, ఆదివారం సెలవు దినంగా ప్రకటించాలని, పండుగలకు సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆశాలకు ప్రత్యేకంగా రెస్టు రూములు ఏర్పాటు చేయాలని, ఆశాలకు పనిభారం తగ్గించాలని, పారితోషికం లేని పనులు చేయించకూడదని, ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పూనమ్ క్లాత్తో కూడిన క్వాలిటీ యూనిఫాం ఇవ్వాలని ఆ వినతిపత్రంలో కోరారు.

ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సారిక, తిమ్మాపూర్ మండల అధ్యక్షురాలు రజిత తోపాటు సుమారు 50 మంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.